అరకొర పుస్తకాలు.. ప్రారంభంకాని పాఠాలు

- విద్యార్థులకు పూర్తి స్థాయిలో పుస్తకాలు పంపిణీ చేయని ప్రభుత్వం
- కొన్ని తరగతులలో ప్రారంభం కాని పాఠాలు
- ఈ నెల 30 నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి ఏదైనా ఉంది అంటే చదువేనని గట్టిగా నమ్మిన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, అందుకు అనుగుణంగానే విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేశారు. నాడు-నేడు కార్యక్రమాలతో బడుల రూపురేఖలను మార్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదని పాఠశాలలు పునఃప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూలు, టై వంటివి అందించేవారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం పాఠశాలలు పునఃప్రారంభమై నెల గడుస్తున్నా అరకొర పుస్తకాలను పంపిణీ చేసింది. పూర్తి స్థాయిలో పుస్తకాలు రాకపోవడంతో కొన్ని తరగతులలో కొన్ని సబ్జెక్టులకు పాఠాలు కూడా జరగడంలేదు. మరోపక్క ఎఫ్ఏ-1 పరీక్షలు దగ్గర పడుతుండగా.. ఉపాధ్యాయులు ఏమీ చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

తల్లిదండ్రుల ఆందోళన

ఆదోని నియోజకవర్గంలో 132 పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 87, ప్రాథమికోన్నత పాఠశాలలు 20, ఉన్నత పాఠశాలలు 23 ఉన్నాయి. అయా పాఠశాలలో 28,942 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ప్రతి ఏటా ఉచితంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తోంది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సెమిస్టర్-1, సెమిస్టర్-2గా పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి తరగతుల వారీగా అవసరమైన


విద్యాశాఖ కార్యాలయంలో నిల్వ వున్న పుస్తకాలు(ఫైల్)

పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్‌బుక్‌లను వేసవి సెలవులు ముగిసే లోపు స్టాక్ పాయింట్లకు చేరవేసి, పాఠశాలల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు అందజేసేవారు. అయితే ప్రస్తుతం పాఠశాలలు తెరచి నెలైనా అరకొర పుస్తకాలు మాత్రమే వచ్చాయి. పూర్తి స్థాయిలో పుస్తకాలు రాలేదు. ఈ నెల 30వ తేదీ నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు కొన్ని పాఠశాలల్లో, కొన్ని తరగతులకు పాఠాలే జరగలేదు. పరీక్షలను ఎలా నిర్వహిస్తారు. పిల్లలు ఎలా పరీక్షలు రాస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాల వివరాలు..

- 6వ తరగతికి 80 శాతం మాత్రమే పుస్తకాలు వచ్చాయి. మిగిలిన 20 శాతం పుస్తకాలు రావాల్సి ఉంది. మరో పక్క అడ్మిషన్లు కూడా జరుగుతున్నాయి. వారికి కూడా పూర్తి స్థాయిలో పుస్తకాలు రావాల్సి ఉంది.
- 7వ తరగతిలో తెలుగు, ఇంగ్లిషు, గణితం, సాంఘిక శాస్త్రం వంటి పుస్తకాలు రావాల్సి ఉంది. పుస్తకాలు రాక పోవడంతో పాఠాలు కూడా సరిగా జరగడం లేదు. దీంతో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.
- 8,9 తరగతులకు 80 శాతం మాత్రమే పుస్తకాలు వచ్చాయి, మిగిలిన 20 శాతం పుస్తకాలు రాలేదు.
- 10వ తరగతిలో భౌతిక శాస్త్ర, భూగోళ శాస్త్రం పుస్తకాలు రాలేదు. ఉపాధ్యాయులు పాఠాలను యూట్యూబ్‌లో చూసికొని విద్యార్థులకు వివరిస్తున్నారు.
- విద్యార్థులకు ఇప్పటి వరకు యూనిఫాం రాలేదు. గతంలో పాఠశాలల పునఃప్రారంభంలోనే పాఠశాలలు ప్రారంభం రోజే పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫాం, షూలు, బెల్టు, టై వంటివి అందించే వారు. ప్రస్తుతం ఇప్పడు ఆ పరిస్థితి లేదు. ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితి.

అన్‌సైజ్ షూల పంపిణీతో ఇబ్బందులు

విద్యార్థులకు పంపిణీ చేసిన షూలు అన్‌సైజ్ ఉన్నాయి. పంపిణీ చేసిన షూలకు విద్యార్థులకు ఉండే పాదాల కొలతలకు ఎలాంటి పొంతన లేదు. దీంతో విద్యార్థులు వేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో విద్యార్థుల కచ్చితమైన కొలతను చూచి షూలను పంపిణీ చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఉడతాభక్తిగా అందజేసి చేతులను దులుపుకున్నారు.

80 శాతం పుస్తకాలు పంపిణీ చేశాం



ఇప్పటి వరకు అయా పాఠశాలలకు 80 శాతం పుస్తకాలను పంపిణీ చేశాం. 7, 10వ తరగతిలో కొన్ని పుస్తకాలు రాలేదు. రాని పుస్తకాలతో పాటు మిగిలిన పుస్తకాలను పంపిణీ చేయమని ఉన్నతాధికారులకు తెలియజేశాం. రెండు మూడు రోజుల్లో పంపిణీ చేస్తామని చెప్పారు, వచ్చిన వెంటనే పుస్తకాలను పంపిణీ చేస్తాము. విద్యార్థులకు యూనిఫామ్స్‌తో పాటు షూల అన్‌సైజ్ విషయం కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. వారు పంపిణీ చేసిన వెంటనే అందరికి అందజేస్తాము.

– వెంకటరమణారెడ్డి డిప్యూటీ ఈఓ, ఆదోని

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయాలి


ధర్నా చేస్తున్న డీఎస్ఎఫ్ విద్యార్థులు

ఆదోని సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు కూడా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు డణాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులంతా నిరుపేదలే అన్నారు. చాల మంది విద్యార్థులు చదువుకోవడానికి పుస్తకాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రాష్టంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులదరికీ పుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమములో డీఎస్ఎఫ్ నాయకులు మంజు కిరణ్, నవీన్, నితీన్, హరిక్రిష్ణ, విక్రమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని 2014లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలబెట్టుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ కోరారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకోవాలన్నారు. డీవైఎఫ్ఐ నాయకులు సురేష్, నాని, రవితేజ, అభి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ కోచింగ్ సెంటర్లపై చర్యలకు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న డీఎస్సీ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు శేఖర్‌నాయుడు, సురేష్, సోమశేఖర్, రాజీవ్, వీరేష్ యాదవ్ కోరారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని.. ప్రమాణాలు పాటించడం లేదని పేర్కొన్నారు.

పాఠశాలలకు బూట్లు పంపిణీ


హెచ్‌ఎంకు బూట్లను అందజేస్తున్న ఎంఈఓ-2

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంజూరైన బూట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ-2 మధుసూదన్‌రాజు శనివారం అందజేశారు. స్థానిక ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్‌లోని ఒకేషనల్ భవనంలో ఆయన మాట్లాడుతూ.. మండలంతో పాటు పట్టణంలోని పాఠశాలల విద్యార్థులకు 22,282 జతల బూట్లు మంజూరైనట్లు తెలిపారు. అదే విధంగా ఇప్పటి వరకు 1,43,742 పాఠ్యపుస్తకాలు, 1,22,980 నోట్ బుక్స్, 15,576 బెల్టులు, 21,859 స్కూల్ బ్యాగ్‌లు మంజూరైనట్లు వెల్లడించారు. స్కూల్ యూనిఫామ్ రావాల్సి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు త్వరితగతిన అందజేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

విజేత మండ్లవానిపల్లె భజన బృందం

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో వెలసిన శ్రీశైలం తాత ఆరాధనోత్సవాలు సందర్భంగా శుక్రవారం రాత్రి రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించారు. మండ్లవాని పల్లె భజన బృందం విజేతగా నిలిచి 6 గ్రాములు బంగారు కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో ఉయ్యాలవాడ(5 గ్రాములు), మూడవ స్థానంలో కడమకుంట్ల, గుత్తి ఆర్ ఉమ్మడిగా(4 గ్రాములు బంగారం, 22 తులాలు వెండి) నిలిచాయి. విజేతలకు శనివారం గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి


ఎమ్మిగనూరు: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రఘు


నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: దివంగత ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎంకె.శివ ప్రసాద్, డిష్‌కేశవరెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అబ్రార్, పట్టణ అధికార ప్రతినిధి సునీల్ కుమార్, వార్డు ఇన్‌చార్జ్‌లు సోమేష్, చంద్రశేఖర్, రవికుమార్‌రెడ్డి, సయ్యద్‌చాంద్, మన్సూర్, ఫయాజ్ పాల్గొన్నారు. అదే విధంగా జైభీం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.

గోనెగండ్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. అణగారిన వర్గాలకు బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ రెండు కళ్లు లాంటివారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, రక్షణమంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి విశిష్ట సేవలందించారని కొనియాడారు. నాగేశ్వర రావు, విజయ్, వెంకటరాముడు, సీమోను, రంగన్న, దస్తగిరి పాల్గొన్నారు.

జంతువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి


కుక్కకు టీకాలు వేస్తున్న డాక్టర్లు

ఆదోని సెంట్రల్: జంతువుల పెంపకంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పశువైద్య ఉప సంచాలకులు బీవీ రమణ తెలిపారు. శనివారం ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని కుక్కలకు ఉచిత రేబిస్‌వ్యాధి నిరోధక టీకాలను వేశారు. వారు మాట్లాడుతూ పశువులు, జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్ వ్యాధులు అంటారన్నారు. రేబిస్ వ్యాధి అనేది కుక్క కాటు వల్ల మనుషులకు, జంతువులకు వ్యాపిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి కుక్క కరిచిన 7 రోజుల నుంచి నాలుగేళ్లలోపు ఎప్పుడైన ఈ వ్యాధి లక్షణాలు బయట పడుతాయని తెలిపారు. ముఖ్యంగా ఈ వ్యాధి లక్షణాలు జ్వరం, తల నొప్పి, గొంతునొప్పి, మింగలేక పోవడం, నీటిని చూస్తే బయపడడం, పిచ్చిగా ప్రవర్తించడం వంటివి చేస్తారన్నారు. అందుకే కుక్క కరిచిన వ్యక్తికి యాంటీ రేబిస్ టీకా ఐదు డోసులు తప్పని సరిగా వేయించాలని సూచించారు. పెంపుడు జంతువులను తాకిన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అవి సంచరించే ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. పెంపుడు జంతువులకు నిర్ణీత గడువు లోగా టీకాలు వేయిస్తే మంచిదని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సోమశేఖర్, విజయ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ నాయకుల హల్‌చల్


డిప్యూటీ తహసీల్దార్‌లతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు

ఆదోని రూరల్: ఆదోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం టీడీపీ నాయకులు హల్‌చల్ చేశారు. మండలంలోని సలకలకొండ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, రైతు శ్రీనివాసులతో పాటు మరికొంత మంది రెవెన్యూ కార్యాలయంలోకి వెళ్లారు. తన పొలాన్ని 2019లో రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి అన్యాయం చేశారని టీడీపీ నాయకుడు, రైతు శ్రీనివాసులు హంగామ చేశాడు. ఈ విషయంపై గత ఐదేళ్లుగా పోరాటం చేసినా ఒక్కరు కూడా పట్టించుకోలేదని, ప్రస్తుతం తమ ప్రభుత్వం వచ్చిందని, న్యాయం చేయాలని టీడీపీ నాయకులతో కలసి డిప్యూటీ తహసీల్దార్‌లు పెద్దయ్య, రమేష్‌రెడ్డి, వలీబాషాతో వాగ్వాదానికి దిగాడు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


సమావేశంలో మాట్లాడుతున్న రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ రవీంద్ర

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఎమ్మిగనూరు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా కేఆర్ నట్‌రాజ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.శివకుమార్, కార్యదర్శిగా కె.సుధాకర్‌రావు, సహాయ కార్యదర్శిగా కె.బీరప్ప, కోశాధికారిగా బి.సైఫుల్లాను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు సత్కరించారు. అంతకు ముందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. క్లబ్ చేస్తున్న సేవలను క్లబ్ జిల్లా గవర్నర్ ఎంకే రవీంద్ర వివరించారు. ఎమ్మిగనూరు నుంచి ఆదోని వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా వైద్యులు వై.గౌడప్పగౌడ్, కేఆర్. నరసింహారెడ్డి, మాలకొండయ్యతో పాటు పాత కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కె.పద్మనాభరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేక పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించుకున్నారు. కౌతాళంతోపాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరి పులి గట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారు జామున అర్చకులు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేపట్టారు. అలాగే మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలోనూ భక్తులు పూజలు నిర్వహించుకున్నారు.

అనుమతిలేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏడీఏలు శ్రీనివాసరావు, మహమ్మద్ ఖాద్రీ
- రూ.22.28 లక్షల విలువైన విత్తన అమ్మకాలు నిలుపుదల

గోనెగండ్ల: డీలర్లు అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ కృష్ణా జిల్లా గన్నవరం ఏడీఏ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం గోనెగండ్లలోని మల్లికార్జున ట్రేడర్స్, శ్రీలక్ష్మీ నరసింహ ట్రేడర్స్, జైకిసాన్ ట్రేడర్స్, వేదశ్రీ ట్రేడర్స్‌లో ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, కర్నూలు సాంకేతిక ఏఓ దస్తగిరితో కలిసి తనిఖీలు చేశారు. నిల్వల రికార్డులు, బిల్లులు, అమ్మకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోనెగండ్లలో సరైన ధ్రువపత్రాలు చూపించనందున మల్లికార్జున ట్రేడర్స్‌లో రూ.1,33,650, శ్రీలక్ష్మీ నరసింహ ట్రేడర్స్‌లో రూ.16,96,320, జైకిసాన్ ట్రేడర్స్‌లో రూ.3,96,950 సహా మొత్తం రూ.22,28,870 విలువైన 46.10 కేజీల వివిధ రకాల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశామని తెలిపారు. విత్తన డీలర్లు సర్టిఫికెట్లు చూపించే వరకు విత్తనాల అమ్మకాలు చేయరాదని ఆదేశించారు. అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్‌బోర్డు, ధరల పట్టిక షాపు ముందు తప్పకుండా పెట్టాలని సూచించారు. ఎమ్మార్పీకి మించి విక్రయించరాదని.. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. రైతులు కూడా ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలు, మందులనే కొనుగోలు చేయాలన్నారు. గోనెగండ్ల ఏఓ హేమలత, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.


విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

సీబీఎస్ఈ పరీక్షా విధానంపై పునఃసమీక్షించాలి


మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష విధానంపై రాష్ట్ర ప్రభుత్వం పునః సమీక్షించాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గోట్ల చంద్రశేఖర్ కోరారు. శనివారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీబీఎస్ఈ అమలవుతున్న ఒక పాఠశాలలోనే కొన్ని తరగతులకు స్టేట్ అకడమిక్ క్యాలెండర్, మరికొన్ని తరగతులకు సీబీఎస్ఈ క్యాలెండర్ అమలు చేయాలంటే కష్టతరమని తెలిపారు. ముఖ్యంగా సిలబస్ అందరికీ ఒక్కటే అయినప్పటికీ పరీక్షా విధానంలో వ్యత్యాసం ఉండడం సరైంది కాదన్నారు. మరోవైపు జూనియర్ కళాశాల ఉన్న సీబీఎస్ఈ పాఠశాలలైతే మూడు రకాలైన అకడమిక్ క్యాలెండర్‌ను నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఇంతటి గందరగోళం ఉండడంతో ప్రభుత్వం పునః సమీక్షించాలని కోరారు. డీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు రామన్న, పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, గుమ్మశ్రీను, శివశంకర్, జగదీష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి


ఆదోని ఎంవీఐకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఆదోని డివిజన్ పరిధిలో కండీషన్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలించే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బస్సులను సీజ్ చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఆదోని ఎంవీఐ శిశిర దీప్తికి వినతిపత్రం ఇచ్చారు. చాలా బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వినోద్, మహేష్, లక్ష్మణ్, విష్ణు ఉన్నారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు


ఆదోనిలో తీవ్రంగా గాయపడిన ఉచ్చీరప్ప

ఆదోని అర్బన్: కౌతాళం మండలం సులేకేరి గ్రామ సమీపంలో శనివారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. హాల్వి గ్రామానికి చెందిన మహంతేష్ పనినిమిత్తం కౌతాళం నుంచి హాల్వికి వెళ్తుండగా.. కాత్రికి నుంచి కౌతాళం వెళ్తున్న కాత్రికి గ్రామానికి చెందిన లక్ష్మన్న కుమారుడు నాగరాజు, ఈరన్న కుమారుడు నాగరాజు బైకులు సులేకేరి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాయపడిన వారిని స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మాంతేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగివున్న బైకును ఢీకొని..

ఆదోని అర్బన్: పట్టణశివారులోని ఆలూరు రోడ్డులో భీమాస్ కళాశాల సమీపంలో నిలిచి ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. బళ్లారి జిల్లా తాళూరు తాలూకా చానాళ్ గ్రామానికి చెందిన లక్ష్మన్న, శివమ్మ గద్వాల నుంచి ఆదోని మీదుగా ఆలూరు వైపు వెళ్తూ భీమా కళాశాల సమీపంలో బైక్‌ను ఆపారు. బైక్ వద్ద శివమ్మ నిలిచి వుండగా ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామానికి చెందిన ఉచ్చీరప్ప ఆదోని నుంచి ఆలూరు వైపు బైక్‌పై వెళ్తూ ఢీకొట్టాడు. దీంతో ఉచ్చీరప్పకు, శివమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఉచ్చీరప్పను మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్

ఆదోని రూరల్: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ ఆదోని టౌన్ కన్వీనర్ వన్నెల మణికంఠ, టౌన్ నాయకులు నరసింహ అన్నారు. పట్టణంలోని పెద్ద మాదిగేరిలో శనివారం డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నాయకులు బండారి హనుమంతు మాదిగ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక స్పృహని కలిగిన డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ మహనీయుడికి భారతరత్న అవార్డును ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.


బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నేడు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఆదివారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా వాడవాడలా గ్రామగ్రామాన దండోరా చేస్తూ జెండా ఎగురవేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు చెప్పారు. మాదిగ సోదరులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బండారి ఈరన్న మాదిగ, బండారి మార్కండేయమాదిగ, బండారి ఎల్లప్ప మాదిగ, రామంజి, అర్జున్, లక్ష్మన్న, రాఘవేంద్ర, వినోద్‌కుమార్, రఘు, శివ, గోపీ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

జూనోటిక్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జంతుశాస్త్ర విభాగాధిపతి యుగంధర్ రెడ్డి

ఆదోని సెంట్రల్: జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జంతుశాస్త్రం విభాగాధిపతి యుగంధర్ రెడ్డి సూచించారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం ప్రపంచ జోనోసిస్ డే కార్యక్రమం జరిగింది. కళా శాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను వేయించాలన్నారు. జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి నివారణ కు తీసుకోవాల్సి జాగ్రతలపై అవగాహన కల్పించా రు.కార్యక్రమములో జంతుశాస్త్ర అధ్యాపకులు డా. నళిని, డా.రంగనాథమ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


డీఎస్పీ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మిగనూరురూరల్: దళితుడిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య కోరారు. శనివారం ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ డీఎస్పీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీ ఎమ్మిగనూరు టీటీడీ కల్యాణ మండపం వద్ద గోనెగండ్ల మండలం గంజెళ్ల గ్రామానికి చెందిన దేవదాసు కుమారుడు ఆనంద్‌పై అదే గ్రామంలో బీసీ వర్గానికి చెందిన వారు దాడి చేసినట్లు తెలిపారు. దాడి జరిగి మూడు రోజులు కావస్తున్నా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


ఎంఈఓ-2 నాగేశప్పకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కోసిగి: మండలంలోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.ఈరన్న, కె.లక్ష్మన్న కోరారు. శనివారం వారు ఎంఈఓ-2 నాగేశప్పను కలిసి వినతి పత్రం అందజేశారు. పలు పాఠశాలల్లో ఎండీయూ వేలిముద్రల సమస్య, రైస్ ఇండెంట్ ఇవ్వకపోవడం, కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని విన్నవించారు.